క్లుప్తంగా

కొమురవెల్లి మల్లన్న సన్నిధిలో మేడ్చల్ ఏసీపీ



మల్లన్న సన్నిధిలో మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో బాలాజీ, ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల భవనం నిర్మించాలని...

సిద్దిపేటరూరల్: మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలను నిర్మించాలని పీసీసీ ఫిషర్‌మెన్ కాంగ్రెస్ కార్యదర్శి బాబేష్ సోమవారం కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఏడు సంవత్సరాల క్రితం ప్రభుత్వం నారాయణరావుపేట గ్రామానికి జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలను మంజూరు చేసిందన్నారు. ఇంతవరకు రెవెన్యూ అధికారులు భూ సర్వే చేస్తున్నారన్నారు.

నిందితులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా, బీజేఆర్ చౌరస్తా, బస్టాండ్ చౌరస్తాతో పాటు పలు చోట్ల సిబ్బందితో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఇందులో 18 మంది వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని సోమవారం సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా మొత్తంగా రూ.8,800 జరిమానాను జడ్జి విధించారు.

హానికర కోనోకార్పస్ చెట్లు తొలగించరూ..

సిద్దిపేటరూరల్: మానవాళికి, పర్యావరణానికి హాని కలిగించేలా ఉన్నటువంటి కోనో కార్పస్ చెట్లను వెంటనే తొలగించాలని డీఎస్పీ జిల్లా అధ్యక్షులు రవిబాబు కోరారు. సోమవారం కలెక్టరేట్ ఏఓకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్వాస సంబంధమైన సమస్యలకు దారి తీసే ఈ చెట్లను తొలగించాలన్నారు. మున్సిపల్ ప్రాంతాల్లో, ఉద్యాన వనాల్లో, రోడ్ల మధ్యలో, గ్రామాల్లో పెంచారన్నారు. హరిత హారం పేరుతో మొక్కలు నాటడం కోసం నర్సరీలో విపరీతంగా పెంచి నాటారన్నారు. వాటి స్థానంలో మంచి మొక్కలను నాటాలన్నారు.

ప్రజాపాలన సేవా కేంద్రం ఏర్పాటు

హుస్నాబాద్‌రూరల్: ప్రజలకు సంక్షేమ పథకాలు అందింజేందుకు మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రం సోమవారం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ వేణు గోపాల్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం గృహ జ్యోతి, మహాలక్ష్మి ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తుందన్నారు. అర్హత గల వారు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు.

ఉద్యోగావకాశాలపై అవగాహన

సిద్దిపేట ఎడ్యుకేషన్: అటానమస్ డిగ్రీ కళాశాలలో సోమవారం టీఎస్‌కేసీ, కెరీర్ అండ్ గైడెన్స్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ప్రసాద్ మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్‌కు ఇలాంటి కార్యక్రమాలు చాలా ఉపయోగపడుతాయన్నారు. సీనియర్ అధ్యాపకులు డాక్టర్ వాసం శ్రీనివాస్, డాక్టర్ అయోధ్యరెడ్డిలు అవగాహన కల్పించారు.

సఫాయి కార్మికుడికి పరామర్శ

తొగుట(దుబ్బాక): మండలంలోని చందాపూర్ గ్రామ పంచాయతీ సఫాయి కార్మికుడు బెజుగామ మల్లయ్య భార్య మల్లవ్వ అనారోగ్యంతో ఇటీవల మరణించగా.. కుటుంబసభ్యులను ప్రత్యేకాధికారి, తహసీల్దార్ శ్రీకాంత్ సోమవారం పరామర్శించారు. 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో కనువిప్పు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి జాతర పరిసరాలలో పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో మూఢ నమ్మకాలపై అవగాహన సదస్సు(కనువిప్పు) కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి నిర్వహించినట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు. రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు, హెల్మెట్ వినియోగం, మూఢ నమ్మకాలు, సామాజిక రుగ్మతల గురించి ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ మంత్రాలు, చేతబడులతో నయం చేస్తామంటే నమొద్దన్నారు.

ఉత్సాహంగా 2కే వాకథాన్





అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకల్లో భాగంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 2కే వాకథాన్ సోమవారం నిర్వహించారు. హౌసింగ్ బోర్డు కాలనీ నుంచి మోడ్రన్ బస్టాండ్ వరకు కొనసాగింది. పట్టణంలో అన్ని బ్యాంకుల సిబ్బంది, ప్రభుత్వ పాఠశాల మహిళా ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొన్నారు. బ్యాంకింగ్‌లో మహిళా సాధికారత, వారికి అందుబాటులో ఉన్న ఫైనాన్స్, ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యజిత్, బ్యాంక్ రీజినల్ హెడ్ వికాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. - సిద్దిపేటకమాన్

ప్రజాపాలన దరఖాస్తుల సవరణ

కమిషనర్ తన్నీరు రమేష్

చేర్యాల(సిద్దిపేట): తప్పులు దొర్లిన 76 దరఖాస్తుల సవరణ కోసం తిరిగి దరఖాస్తులు స్వీకరించినట్లు కమిషనర్ తన్నీరు రమేష్ తెలిపారు. సోమవారం పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన 2 హెల్ప్ సెంటర్లలో దరఖాస్తుల స్వీకరణను మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణి ప్రారంభించారు. అంగడి బజార్ యూపీఎస్ ఉర్దూ మీడియం స్కూల్, మున్సిపల్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన రెండు కేంద్రాల్లో 76 సవరణ, 6 కొత్త దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, కౌన్సిలర్లు మంగోలు చంటి, ఆడెపు నరేందర్, కో ఆప్షన్ సభ్యులు ఆరోగ్య రెడ్డి, మేనేజర్ ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

పీఏసీఎస్ డైరెక్టర్ రాజీనామా

దుబ్బాకటౌన్: పీఏసీఎస్ డైరెక్టర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కాల్వ నరేష్ సోమవారం బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించారు.

పంటలు ఎండిపోతున్నా.. నీళ్లివ్వరా?

మల్లన్నసాగర్ కాల్వ నిర్మాణం పూర్తి చేయాలని రైతుల ఆందోళన



ధర్నా చేస్తున్న రైతులు

దుబ్బాకటౌన్: మల్లన్నసాగర్ నీళ్ల వస్తాయనే ఆశతో వరి పంటలు వేసుకుంటే తీరా కాల్వ నిర్మాణం పూర్తి చేయకుండానే మధ్యలోనే ఆపేశారని దుబ్బాక, మల్లాయపల్లి, చెల్లాపూర్‌కు చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నిర్మాణం పూర్తి చేసి ఎండుతున్న పంటలను కాపాడాలన్నారు. సోమవారం దుబ్బాక-ముస్తాబాద్ రోడ్డుపై వారు ధర్నాకు దిగారు. ఆపై దుబ్బాక-చెల్లాపూర్ కాల్వ వద్ద బైఠాయించారు. కేవలం వంద మీటర్లకు పైగా ఉన్న పెండింగ్ కాల్వను పూర్తి చేస్తే దుబ్బాక, చెల్లాపూర్, మల్లాయపల్లి, చీకోడ్, ఆరపల్లి, అచ్చుమాయపల్లి, పోతారం, గంభీర్‌పూర్, కమ్మరపల్లి, అచ్చుమాయపల్లి ఆయా గ్రామాల్లోని చెరువులు నిండుతాయన్నారు. నెల క్రితం పనులు ప్రారంభమైతే పూర్తయి తమ పంటలు పండుతాయని సంతోష పడ్డామన్నారు. వారం రోజులుగా మొత్తం పనులు నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే తమ వద్దకు వచ్చిన కాంట్రాక్టర్‌తో వారు వాగ్వాదానికి దిగారు. పనులు ఎందుకు ఆపివేశారని ప్రశ్నించారు.

పంట మార్పిడితో తెగులకు చెక్



లింగంపేటలో కీర పంటను పరిశీలించిన శాస్త్రవేత్త విజయ్ కుమార్

తొగుట(దుబ్బాక): పంటల మార్పిడితోనే మొగి పురుగును అరికట్ట వచ్చునని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త విజయ్ కుమార్ రైతులకు సూచించారు. మండలంలోని లింగంపేటలో వరి, కీర పంటలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వరిలో మొగి పురుగు ఉధృతిని, నాచును గమనించారు. నివారణకు తొలి దశలో గుర్తించి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. పలు మందుల వినియోగాన్ని, పిచికారీ చేసే విధానాన్ని వివరించారు. కీర పంటలో నులిపురుగు నివారణకు సాగుకు ముందు ఫ్లోపైరమ్ అనే మందు ఎకరాకు 300 ఎంఎల్‌ను స్ప్రే చేయాలన్నారు. బంతి పంటతో పంటమార్పిడి చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఓ మోహన్, ఏఈఓ రాజేష్, రైతులు యాదగిరి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సిద్దిపేటరూరల్: జర్మనీలో నర్సింగ్ ఉద్యోగాల శిక్షణ, నియామకాల కోసం అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ సోమవారం తెలిపారు. ఈనెల 6న ఆర్‌వీఎం కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌లో అవగాహన సదస్సును నిర్వహించనున్నట్లు తెలిపారు. నర్సింగ్, జీఎన్ఎం, డిప్లొమా, బీఎస్సీ, 22 నుంచి 38 సంవత్సరాల వయస్సు వారు అర్హులని సూచించారు. జర్మన్ భాషా తరగతుల్లో చేరేందుకు అవగాహన కార్యక్రమ అనంతరం నిర్వహించే ఎంపిక ప్రక్రియకు కూడా హాజరు కావచ్చని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు 99088-30438 నంబర్‌లో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

'డబుల్ బెడ్రూం'లను పూర్తి చేయండి

హుస్నాబాద్: అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్లను పూర్తి చేయించి న్యాయం చేయాలని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో లబ్ధిదారులు ధర్నా నిర్వహించారు. ఆయన విగ్రహానికి వినతి పత్రం ఇచ్చి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో పట్టణ శివారులో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లకు లబ్ధిదారులను గుర్తించి పట్టాలు ఇచ్చారన్నారు. ఆరు నెలలు గడుస్తున్నా నేటికి వాటిని కేటాయించలేదన్నారు. కొన్ని నిర్మాణ దశలో ఉన్నాయని తెలిపారు. పూర్తి చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్న పట్టించుకునే నాథుడు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. అద్దె ఇళ్లలో ఉంటూ కిరాయి కట్ట లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్వర్ పాష, నాయకులు అయిలేని మల్లికార్జున్ రెడ్డి, ఇంద్రాల సారయ్య, చిత్తారి శ్రీనివాస్, లబ్ధిదారులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న లబ్ధిదారులు

వైభవంగా భద్రకాళి వీరభద్రుడి కల్యాణం

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని లద్నూరులో భద్రకాళి సమేత వీరభద్రుని కల్యాణం ఆలయ పూజారి దూసకంటి రాజేశ్‌శర్మ ఆధ్వర్యంలో కమనీయంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకొని తరించారు. అంతకు ముందు లఘున్యాసపూర్వక రుద్రాభిషేకం, గణపతిపూజ, పూర్ణాహారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పీఏసీఎస్‌వైస్ చైర్మన్ ఇర్రిరాజిరెడ్డి, ఎంపీటీసీ గుజ్జుక సమ్మయ్య, మాజీ సర్పంచ్‌లు జీడికంటి సుదర్శన్, సురేష్, మాజీ ఉపసర్పంచ్ బెడద కుమారస్వామి, గ్రామస్తులు అన్నోజు శ్రీనివాస్‌చారి, భాస్కర్‌చారి తదితరులు పాల్గొన్నారు.



స్వామి కల్యాణం చేస్తున్న అర్చకులు రాజేశ్‌శర్మ

ప్రమాదాలపై అవగాహన

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో ట్రాఫిక్ సీఐ రామకృష్ణ సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. వాహనాల తనిఖీల్లో 50 మంది వాహనదారులు మద్యం తాగి పట్టుబడ్డారని తెలిపారు. వారికి ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అతివేగం, హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం, రాంగ్ రూట్ డ్రైవింగ్, మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల జరిగిన ప్రమాదాల నివారణ గురించి అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఎట్టి పరిస్థితిలలో మద్యం తాగి వాహనాలు నడపకూడదని సీఐ సూచించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు పాటించి వాహనాలను నడపాలని సూచించారు. మద్యం తాగి వాటిని నడపబోమని వారితో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. వీరిని విడతల వారీగా కోర్టుకు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ వినయ్‌సాగర్, ఏఎస్ఐ ఉమేష్, కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.



డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ట్రాఫిక్ సీఐ రామకృష్ణ

సేవలు అభినందనీయం

గజ్వేల్‌రూరల్: రామకోటి భక్త సమాజం చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని భద్రాచల దేవస్థాన ఏఈఓ శ్రవణ్‌కుమార్ పేర్కొన్నారు. సీతారాముల కల్యాణోత్సవంలో వినియోగించే తలంబ్రాలను గోటితో వలుస్తారు. వాటిని సిద్ధం చేసేందుకు గజ్వేల్ పట్టణానికి చెందిన రామకోటి భక్త సమాజానికి భద్రాచల దేవస్థానం తరఫున 150 కిలోల వడ్లను అందించారు. గోటితో వలిపించి తలంబ్రాలుగా సిద్ధం చేసింది. వాటిని తిరిగి శ్రవణ్‌కుమార్‌కు సోమవారం రామకోటి భక్తసమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు అప్పగించగా శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో భద్రాచల దేవాలయ పూజారులు పాల్గొన్నారు.



తలంబ్రాలను అప్పగిస్తున్న రామకోటి రామరాజు

అభివృద్ధే ధ్యేయం: ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి



తిమ్మక్కపల్లిలో మురుగు కాల్వ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ప్రభాకర్‌రెడ్డి

రాయపోలు(దుబ్బాక): నియోజకవర్గ అభివృద్ధే తన ధ్యేయమని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. రాయపోలు మండలం తిమ్మక్కపల్లిలో సోమవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. పల్లెలన్నీ బాగు పడితేనే నియోజకవర్గం బాగుంటుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ యాదగిరి, నాయకులు దయాకర్, రేకుల నర్సింహారెడ్డి, వెంకటేశ్వర శర్మ తదితరులున్నారు.

అపూర్వ సమ్మేళనం

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని తిగుల్.. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1998-99 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు సోమవారం ఓ వ్యవసాయ క్షేత్రంలో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. తరగతి గదుల్లో జరిగిన జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఒకరినొకరు బాగోగాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం చదువు చెప్పిన గురువులు వెంకటేశం, మధుసూదన్‌లకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో విద్యార్థులు

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఏపీఎం ఆనంద్

జగదేవ్‌పూర్(గజ్వేల్): నాబార్డు ఆధ్వర్యంలో శిక్షణ శిబిరాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం ఆనంద్ అన్నారు. సోమవారం మండలంలోని చిన్నకిష్టాపూర్‌లో నాబార్డు సహకారంతో మగ్గం వర్క్, ఫ్యాబ్రిక్ పెయిటింగ్‌పై ఉచిత శిక్షణా శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో 30 మందికి 20 రోజుల పాటు శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తామన్నారు. గ్రామంలో మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీసీ నాగరాజు, కార్యదర్శి రవి, సంస్థ డైరెక్టర్ రాజలింగం, వీఓఏ మంగ, మహిళలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ చర్యలు తీసుకోవాలి



సిద్దిపేటరూరల్: ఎస్సీగా తప్పుడు ధ్రువీకరణ పత్రాలు పొందిన వారిపై చర్యలు తీసుకోవాలని ఇబ్రహీంపూర్ గ్రామ ఎస్సీ కులస్తులు అన్నారు. సోమవారం గ్రామంలోని కొందరు బీసీలు.. ఎస్సీలుగా తప్పుడు ధ్రువ పత్రాలు పొందారని, వాటిని రద్దు చేయాలని ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ఎస్సీలకు రాకుండా పోతాయన్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ ఎస్సీ మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

◆ విద్యార్థికి సన్మానం

బెజ్జంకి(సిద్దిపేట): షాట్‌పుట్‌లో జాతీయ స్థాయికి ఎంపికైన పాపన్నపల్లె గ్రామానికి చెందిన అంగెరిక అర్చితను సోమవారం బెజ్జంకి మాజీ సర్పంచ్ నర్సయ్య, నాయకులు ప్రభాకర్, ఆరెక్షత్రియ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. బాలిక రాజన్న సిరిసిల్లా జిల్లా ఇల్లంతకుంట కేజీబీవీ పాఠశాలలో 9వ తరగతి చదువుతుంది. ఇటీవల గుజరాత్‌లో జరిగిన అండర్ 14లో షాట్‌పుట్ పోటీలో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో రాములు, లింగారావు, శ్యాంరావు, కిషన్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

◆ కాంగ్రెస్‌లోకి చేరికలు

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని ఓ మాజీ సర్పంచ్‌తో పాటు మరో ఇద్దరు మాజీ మహిళా సర్పంచ్‌ల భర్తలు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. అందె మాజీ సర్పంచ్ చుక్క శంకర్.. మల్లుపల్లి, ధర్మారం గ్రామాలకు చెందిన మాజీ మహిళా సర్పంచ్‌ల భర్తలు సిద్ది భూపతి గౌడ్, గూళ్ల బాగులు, కాసులాబాద్, బీఆర్ఎస్ నాయకులు చంద్రమౌళి, నర్సింహారెడ్డి సోమవారం దుబ్బాక, సిద్దిపేట కాంగ్రెస్ ఇన్‌చార్జీలు చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, పూజల హరికృష్ణల సమక్షంలో చేరారు. అల్వాల మాజీ సర్పంచ్ ఎనగంటి కిష్టయ్య, ఆరెపల్లి రాజు పాల్గొన్నారు.

◆ ఐదో రోజుకు దీక్ష

బెజ్జంకి (సిద్దిపేట): గత ప్రభుత్వం పంపిణీ చేసిన భూముల్లో అక్రమాలు జరిగాయని వాటిని రద్దు చేసి అర్హులకు ఇవ్వాలని మండలంలోని గూడెం గ్రామానికి చెందిన పలువురు దళితులు కోరారు. తమకు కూడా మూడెకరాలు భూమి ఇవ్వాలన్నారు. బెజ్జంకి తహసీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన రిలే దీక్ష సోమవారం 5వ రోజుకు చేరింది. దళిత, ప్రజా సంఘాల నాయకులు మద్దతు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో గౌరవ్వ, శాంతవ్వ, శంకరవ్వ, పోశవ్వ, బాలవ్వ, బాబు పాల్గొన్నారు.

◆ దరఖాస్తులు చేసుకోవాలి



జగదేవ్‌పూర్(గజ్వేల్): అర్హులైన వారందరూ ప్రభుత్వ పథకాలకు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీపీ బాలేషంగౌడ్ అన్నారు. సోమవారం మండల కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులకు పథకాలు అందకుంటే వెంటనే సేవా కేంద్రంలో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీటీసీలు కవిత, మహేందర్‌రెడ్డి, మహేష్, కో-ఆప్షన్ సభ్యుడు ఏక్బాల్, నాయకులు నాగరాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

◆ ఆత్మీయ సమ్మేళనానికి తరలిరండి

హుస్నాబాద్: కరీంనగర్‌లో ఈనెల 10న నిర్వహించే జిల్లా గౌడ సోదరుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆసంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం ఎల్లమ్మ దేవాలయం ఆవరణలో సమ్మేళన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కొయ్యడ కొమురయ్య, హుస్నాబాద్ గౌడ సంఘం అధ్యక్షుడు పూదరి వరప్రసాద్, నాయకులు పచ్చిమట్ల శ్రీనివాస్ గౌడ్, పచ్చిమట్ల రాజయ్య పాల్గొన్నారు.